# కొడుకు

**రాఘవరావుకి రెండోసారి కూడా కూతురు పుట్టింది.**

ఆ విషయం విన్న వెంటనే మనసు చివుక్కు మంది. గుండె బాధతో విలవిల్లాడింది.

ఈ సారి గ్యారంటీగా కొడుకే పుడ్తాడని ఎంతో ఆశతో వున్నారు - జానకి, రాఘవరావులు.

పుత్రుడు పున్నామ నరకం నుండి రక్షిస్తాడని జానకమ్మ అభిప్రాయం.

తల కొరివి పెట్టేవాడు లేకుండా పోతాడంటూ నస పెడ్తోంది - రాఘవరావు తల్లి.

రాఘవరావు వుద్దేశం మాత్రం - మగ పిల్లలు తల్లి దండ్రులకి ఇన్స్యూరెన్స్ లాంటి వాళ్ళని - జాగ్రత్తగా పెంచి పెద్ద చేస్తే, ముసలి తనంలో ఆదుకుంటారని- పోతే - యింకోసారి చూదామంటే - అమ్మో! ముగ్గురు పిల్లల్ని పెంచటమంటే మాటలా? - అదీ రోజు రోజుకి ధరలు పెరుగుతున్న ఈ రోజుల్లో - అదీగాక, మూడో సారి కూడా ఆడ పిల్లే పుడ్తే?!-

ఆలోచిస్తున్న రాఘవరావు, పక్కింట్లో నుండి పెద్దగా కేకలు ఏడ్పులు విన్పడడంతో వులిక్కి పడి లేచాడు.

రిటయిర్డ్ టీచర్ పరంధామయ్య గారు చని పోయారు. ఆయన భార్య, ఆయన దగ్గర చదువుకునే కుర్రాళ్ళు గగ్గోలు పెడ్తున్నారు. పిల్లలకి కబురు చేయ మని అంతా హడావిడిగా మాట్లాడ్తున్నారు.

రాఘవరావు వెంటనే ముందుకెళ్ళాడు.

ఇద్దరు కొడుకులు ఆయనకి. పెద్దాడు అమెరికాలో వుంటాడట. 'వాడికి ఎప్పటికి కబురందేనూ, వాడు ఎప్పటికి వచ్చేనూ?' అన్నది పరంధామయ్య గారి భార్య. చిన్న కొడుకు తండ్రి మీద కోపం వచ్చి యింట్లో నుండి వెళ్ళిపోయాట్ట- 'ఎక్కడు న్నాడని చెప్పన్నాయినా?' అంటోందావిడ పూడుకు పోయిన గొంతుతో-

"కానివ్వండి... మేమున్నాము' అంటూ ముందు కొచ్చారు ఆయన దగ్గర చదువుకొంటున్న కాలేజీ కుర్రాళ్ళు.

రాఘవరావు మెదడులో మెరుపు మెరిసి, సన్నగా పెదాల మీదకు పాకింది.

* * *

"మనకున్న పిల్లలు చాలు - నేను ఆపరేషన్ చేయించుకుంటున్నాను - మంచితనం చాలు జానకి- లోకమంతా కొడుకులవుతారు" అన్నాడు రాఘవ రావు - పచ్చిబాలింతరాలు జానకిని పొదివి పట్టు కుంటూ.

-శరచ్చంద్ర




## పొద్దెక్కి వచ్చాను

బ్రహ్మశ్రీ చిలకమర్తి మల్లయ్య శాస్త్రిగారు పిఠాపురం మహారాజావారి అభిమానకనే కాక, ఆస్థాన కవి కూడా! శ్రీ రాజావారు, వస్తుతః హాస్య సంభాషణా చతురులైన శాస్త్రి గారి మాటలకి మరీ మరీ మురిసిపోయేవారు. వారికోసం ప్రతి రోజూ ఉదయం క్రమం తప్పకుండా గుర్రపు ర్టు పంపించేవారు. శాస్త్రి గారిని ఆస్థానానికి తోడ్కొని రావడానికి.

ఆ రోజు ఏ కారణం చేతనో గుర్రపు షార్టు రాలేదు. అది తెలిసిన రాజావారు సభలో శాస్త్రిగారిని చూసి,

"ఈ రోజు నేను షార్టు పంపించలేదు గదా! మరి నిమెక్కి వచ్చారు శాస్త్రిగారూ!" అనడిగారు.

"అందుకే పొద్దెక్కి వచ్చాను!" శాస్త్రిగారు సమాధానం ఇచ్చారు.

- తవుట నాగభూషణం

## లాంగ్ జంప్

ఆ రోజు 'పెవిలియన్ గ్రౌండ్' అంతా కళకళలాడుతూ వుంది. అక్కడ ఆ రోజు 'లాంగ్ జంప్' పోటీలు జరగడమే అందుకు కారణం. నిర్వాహకులు, పాల్గొనడానికి వచ్చిన వారు హడావిడిగా తిరుగుతున్నారు.

అయితే ఆ పోటీలు చూడడానికి వచ్చిన ప్రేక్షకులు మాత్రం, ఆ పోటీలో పాల్గొంటున్న ఒక వ్యక్తిని చూసి విపరీతంగా ఆశ్చర్యపోయారు. కారణం వరుసగా ఎనిమిది గంటల పాటు ఏకథాటిగా మూడు కిలోమీటర్ల పొడవు రథం ముగ్గు వేసి ఆ ఊరి మహిళా మండలి వారిచే 'ముగ్గురాణి' బిరుదు అందుకున్న 'జోగులాంబ' భర్త 'వామన్రావ్' ఆ వ్యక్తి కావడం. వామన్రావ్ పేరుకు తగ్గట్లే పొట్టిగా వుంటాడు. కానీ ప్రేక్షకులు ఆశ్చర్యపోయింది అందుకు కాదు.

వామన్రావ్ ఇంతవరకూ ఏ విధమైన పోటీలలో పాల్గొన లేదు సరికదా, అతడింత వరకూ ఒక్కసారి కూడా లాంగ్ జంప్‌లో పాల్గొనలేదు.

కాని ప్రేక్షకుల అంచనాలు తల్లకిందులు చేస్తూ వామన్రావ్ లాంగ్ జంప్‌లో ఫస్ట్ వచ్చాడు. అందరూ విపరీతంగా ఆశ్చర్యపోయారు. అదే విషయం అడిగారు వామన్రావ్‌ని.



"ఇందులో వింతేమీ లేదు. దూకవలసిన దూరాన్ని మా ఆవిడ వేసిన రథం ముగ్గుగా భావించి, అదిగాని తొక్కితే మా ఆవిడ ఏం చేస్తుందో ఊహించుకున్నాను అంతే"... గుట్టు విప్పాడు వామన్రావ్.

—కె.ప్రభాకరరావు

